# బీఆర్ఎస్‌కు తుంగతుర్తి నియోజకవర్గ దళితుల జై

- నియోజక వర్గం మొత్తానికి ఇస్తామని ప్రకటించిన సీఎం కేసీఆర్
- ఇప్పటికే తిరుమలగిరి మండలంలో వంద శాతం అమలు
- ఇతర మండలాల్లో 4 వేల కుటుంబాలకు లబ్ధి
- ఎమ్మెల్యే కిశోర్ గెలుపుతో మిగిలిన 17,396 కుటుంబాలకు అందనున్న దళిత బంధు


తిరుమలగిరిలో హార్డ్‌వేర్ షాప్ నిర్వహిస్తున్న దళిత బంధు లబ్ధిదారు పరశురామ్

తిరుమలగిరి, నవంబర్ 23 : తుంగతుర్తి నియోజక వర్గ పరిధిలోని మెజారిటీ దళిత కుటుంబాలు బీఆర్ఎస్‌కు జై కొడుతున్నాయి. ఇటీవల తిరుమలగిరిలో ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ నేతృత్వంలో సమర శంఖారావం సభ జరిగింది. ఈ సభకు హాజరైన ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రసంగిస్తూ కిశోర్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకోండి, నియోజక వర్గంలో ఉన్న మొత్తం దళిత కుటుంబాలకు దళిత బంధు పథకం అమలు చేస్తామని ప్రకటించారు. గతంలో తిరుమలగిరి మండలానికి పైలెట్ ప్రాజెక్ట్‌గా దళిత బంధు ప్రకటించడంతో మండల పరిధిలోని 2,223 కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున రూ.250 కోట్లు అందాయి. దాంతో తమకు కూడా దళిత బంధు అందుతుందనే నమ్మకంతో నియోజక వర్గ దళిత కుటుంబాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. నియోజక వర్గ పరిధిలో మొత్తం 23,396 దళిత కుటుంబాలు ఉన్నాయి. ఇప్పటికే తిరుమలగిరి మండలంలో 2,223 కుటుంబాలకు, మిగతా మండలాల్లో 4 వేల కుటుంబాలకు దళిత బంధు అందింది. ఇంకా 17,396 కుటుంబాలకు దళిత బంధు అందాల్సి ఉన్నది. సీఎం ప్రకటనతో 23,396 కుటుంబాలకు చెందిన దాదాపు 70 వేల మంది ఓటర్లు బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కిశోర్ కుమార్‌కు మద్దతు తెలుపుతున్నారు.

### దళితుల జీవితాల్లో సమూల మార్పు తీసుకొచ్చేలా..

ఇప్పటి వరకు దళితుల అభ్యున్నతి కోసం ఏ పార్టీ, ఏ నాయకుడు ఆలోచించి మంచి పథకం అమలు చేసిన దాఖలాలు లేవు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ దళిత జాతికి మేలు జరిగేలా అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. చిరు వ్యాపారాల నుంచి పరిశ్రమల ఏర్పాటు వరకు అవకాశాలు కల్పిస్తున్నారు. అలాగే ప్రత్యేక గురుకులాలు, స్టడీ సర్కిళ్లు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో దళితుల జీవితాల్లో సమూల మార్పు కోసం తీసుకువచ్చిందే దళిత బంధు పథకం. రుణం రూపంలో కాకుండా.. ఎలాంటి ఈఎంఐలు లేకుండా.. షూరిటీల అవసరమే లేని దళిత బంధును ప్రవేశపెట్టి ఒక్కో నిరుపేద దళిత కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున అందించడమే ఈ పథకం ఉద్దేశం.

### తుంగతుర్తి నియోజక వర్గానికి బొనాంజా..

హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా మూడోసారి గాదరి కిశోర్‌కుమార్‌ను గెలిపిస్తే తుంగతుర్తి నియోజక వర్గం మొత్తానికి దళిత బంధు ఇస్తానని సీఎం కేసీఆర్ ఇటీవలి తిరుమలగిరి సభలో ప్రకటించడంతో నియోజక వర్గంలోని దళితులంతా ఒక్కతాటిపైకి వస్తున్నారు. ఎమ్మెల్యేగా కిశోర్‌కుమార్‌ను గెలిపించుకుని దళిత బంధు రూపంలో ప్రభుత్వ చేయూత అందుకుని ఆర్థికంగా ఎదుగాలని ఆశిస్తున్నారు. ఇదే అదునుగా ఎమ్మెల్యేగా కిశోర్‌ను గెలిపించుకోవడానికి ఏకమవుతూ సామూహికంగా మద్దతు ప్రకటిస్తున్నారు.

### మొత్తం 23,396 కుటుంబాలకు లబ్ధి..

2014 లెక్కల ప్రకారం నియోజక వర్గంలో 22,396 కుటుంబాలు ఉన్నాయి. 2023 వరకు సుమారు వెయ్యి కుటుంబాలు పెరిగి 23,396 చేరుకున్నట్లు అంచనా. అయితే ఇప్పటికే తిరుమలగిరి మండలంలో 2,223 కుటుంబాలతో పాటు ఇతర మండలాల్లో మరో 4 వేల కుటుంబాలకు అంటే మొత్తం దాదాపు 6 వేల కుటుంబాలకు దళిత బంధు అందింది. కాగా కిశోర్‌కుమార్‌ను గెలిపిస్తే నియోజక వర్గం మొత్తానికి దళిత బంధు ఇస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించడంతో ఆయనను గెలిపించుకోవాలని దళిత సమాజం పట్టుదలతో పని చేస్తున్నది. 23,396 కుటుంబాల్లో సరాసరి ముగ్గురు చొప్పున ఓటర్లను లెక్కేసుకున్నా దాదాపు 70 వేల మంది దళిత ఓటర్లు ఉంటారనేది అంచనా. వీరంతా ఏకపక్షంగా బీఆర్ఎస్‌కు జై కొడుతున్నారు.

**2014లో పాత 6 మండలాలు ఉండగా సమగ్ర కుటుంబ సర్వే లెక్కల ప్రకారం నియోజకవర్గంలో ఎస్సీ కుటుంబాలు, జనాభా ఈ విధంగా ఉన్నది**

| మండలం పేరు | కుటుంబాలు | జనాభా |
|---|---|---|
| తిరుమలగిరి | 3,172 | 11,495 |
| తుంగతుర్తి | 4,376 | 14,786 |
| జాజిరెడ్డిగూడెం | 2,668 | 8,783 |
| నూతనకల్ | 4,289 | 14,017 |
| మోత్కూర్ | 4,492 | 14,954. |
| శాలిగౌరారం | 3,399 | 12,815 |

### కేసీఆర్ మాటిస్తే తప్పడు



ముఖ్యమంత్రి కేసీఆర్ మాట ఇస్తే తప్పని వ్యక్తి. ఎమ్మెల్యేగా కిశోర్ కుమార్‌ను గెలిపించుకుని దళిత బంధు పథకం నియోజక వర్గ వ్యాప్తంగా అమలు జరిగేలా చూసుకుంటాం. దళితులు అన్ని రంగాల్లో రాణించాలన్నా, ఆర్థికంగా బలోపేతం కావాలన్నా కిశోర్‌కుమార్‌ను గెలిపించుకుని తీరాలి. గతంలో ఏ ప్రభుత్వాలు దళితులను పట్టించుకున్న పాపాన పోలేదు. నేడు సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ చొరవతో తిరుమలగిరిలో దళిత బంధుతో దళితుల జీవితాల్లో స్పష్టమైన మార్పు కనిపిస్తుంది. ఆత్మగౌరవంతో జీవించేలా దళిత బంధు ఉపయోగపడుతుంది. దళితుల తలరాత మార్చే పథకం దళిత బంధు

– కందుకూరి బాబు, తిరుమలగిరి

### ప్రతి ఒక్కరూ బీఆర్ఎస్‌ను ఆశీర్వదించాలి



రాష్ట్రంలో ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజల హృదయాల్లో నిలిచారు. ఎమ్మెల్యే కిశోర్‌ను గెలిపిస్తే నియోజక వర్గంలోని దళిత కుటుంబాలన్నింటికీ దళిత బంధు ఇస్తానని సీఎం కేసీఆర్ నిండు సభలో ప్రకటించారు. నియోక వర్గంలోని ప్రతి దళితుడికి దళిత బందు రావాలంటే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ కారు గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యే కిశోర్‌ను గెలిపించాలి. దళిత బంధు పొందిన ప్రతి ఒక్కరూ నాడు కూలీలుగా నేడు యజమానులుగా మారి జీవితాల్లో వెలుగులు నింపుకున్నారు. కావునా దళితులంతా బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలి.

– తడకమళ్ల రవికుమార్, తుంగతుర్తి

### దళితుల బతుకులకు భరోసా దళిత బంధు



దళిత బంధు పథకం దళితుల జీవితాల్లో వెలుగు నింపుతుంది. యూనిట్ పొందిన కుటుంబం తమ కాళ్లమీద తాము నిలబడి ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. అలాంటి పథకాన్ని వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే కిశోర్ గెలుపుతో నియోజక వర్గ వ్యాప్తంగా సీఎం కేసీఆర్ అమలు చేస్తామని ప్రకటించడం హర్షించదగ్గ విషయం. ఇదే జరిగే దళితులు ఒకరి కింద పనిచేయకుండా సొంతంగా వివిధ రకాల వ్యాపారాలు ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకుంటారు. కావునా నియోజక వర్గంలో ఉన్న దళితులందరూ ఆలోచించి బీఆర్ఎస్ కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌ను గెలిపించుకుంటే మంచిది.

– నాగెల్లి భూషణం, మద్దిరాల

### దళితుల పాలిట దేవుడు సీఎం కేసీఆర్



ముఖ్యమంత్రి కేసీఆర్ దళితుల పాలిట దేవుడిలా నిలిచారు. దళిత బంధు పథకం ప్రవేశపెట్టి కుటుంబానికి రూ.10 లక్షలు మంజూరు చేసి స్వయం ఉపాధి పొందే అవకాశం కల్పించిన మహోన్నత వ్యక్తి సీఎం కేసీఆర్. మూడోసారి కిశోర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించినట్లైయితే తుంగతుర్తి నియోజక వర్గంలో ఉన్న ప్రతి దళిత కుటుంబానికి దళిత బంధు పథకం మంజూరు చేస్తానని సీఎం ప్రకటించారు. బీఆర్ఎస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించి సీఎం కేసీఆర్‌ను ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రిని చేస్తాం

– బత్తుల సురేశ్, చిల్పకుంట్ల, నూతనకల్ మండలం

# అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

- మంత్రి జగదీశ్‌రెడ్డి సతీమణి సునీత

సూర్యాపేట టౌన్, నవంబర్ 23 : సూర్యాపేటలో ఎమ్మెల్యేగా, మంత్రిగా గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి నాయకత్వంలో పదేండ్లుగా ప్రశాంత వాతావరణంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రజలు మరోమారు ఆశీర్వదించాలని మంత్రి జగదీశ్‌రెడ్డి సతీమణి సునీత తండ్రి రామచంద్రారెడ్డి ప్రజలను కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని 35, 38, 45వ వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించి పార్టీ మ్యానిఫెస్టోను వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. ప్రశాంత వాతావరణంలో అభివృద్ధి పాలన మునుముందు కొనసాగాలంటే ఈ నెల 30న ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. మంత్రి కుమారుడు వేమన్‌రెడ్డి, కౌన్సిలర్లు జ్యోతీశ్రీవిద్యాకరుణాకర్, జ్యోతి కరుణాకర్, కౌశిక్‌రెడ్డి, తాహేర్, సల్మా మస్తాన్ పాల్గొన్నారు.


సూర్యాపేటలోని 22వ వార్డులో ప్రచారం చేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి సతీమణి సునీత


ఆత్మకూర్.ఎస్ : పాతర్లపహాడ్‌లో ప్రచారం చేస్తున్న సీనియర్ న్యాయవాదులు


బొడ్రాయిబజార్ : సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ దివ్యాంగ విభాగం రాష్ట్ర నాయకుడు మల్లారెడ్డి


సూర్యాపేట రూరల్ : రామారంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ దివ్యాంగ విభాగం జిల్లా అధ్యక్షుడు నయీమ్


బొడ్రాయిబజార్ : 20వ వార్డులో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


సూర్యాపేటలోని 35వ వార్డులో ప్రచారం చేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి తండ్రి రామచంద్రారెడ్డి, కుమారుడు వేమన్‌రెడ్డి